# రంగు బొమ్మలు

ఆ అమ్మాయిని నే నెప్పుడూ చూస్తూ వుంటానేగాని, ఆ మెవరో నాకు తెలీదు.

అతి నాజూకుగా ఎడంచేత్తో పుస్తకాల దొంతరను పట్టుకుని సందుమలుపు తిరుగుతుంది. సరిగ్గా అదే సమయానికి నేనూ వాకిట గుమ్మం దాటుతూవుంటా. ఆమె తలవంచుకుని చకచక వెళ్లిపోతుంది. నేనూ అంతకంటే బిడియంగా వెళ్లిపోతూవుంటా. ఆమె యిల్లు, మాయింటి వెనకాల సందులోనేనని ఆమె రాకపోకలవలన తెలుసుకున్నా. ఎప్పుడామె కనిపించినా, నా కళ్ళవుతే చూడాలని ఆరాటపడటంలేదుగాని, మనస్సుమాత్రం ఆమెపై పుకుపురమాయిస్తూ వుంటుంది.

చీరె జాకెట్టులో ఆమె తన వయస్సుకి మించినదానిలాగ కనిపిస్తుంది. చొక్కా పరికిణా తొడుక్కున్నప్పుడు మాత్రం చిన్నపిల్లగా కనిపిస్తుంది. ఒక్కొక్కనాడయితే బిత్రులాగు తొడుక్కుని, మోకాళ్ళదాకా గౌను వేసుకుని మెడచుట్టూ పల్చటి తెల్లని ఉత్తరీయాన్ని తిప్పుకుంటూ పీటుగా వెడుతూ వుంటుంది. ఆమె నడకలో కదలికలు చూడ ముచ్చటగా వుంటాయి. మధ్య పాపిడి తీసి, రెండు జడలు రెండు భుజాలమీదనుంచి వేలాడదీస్తుంది. జడల కొసలు గజిబిజిగా వుంటాయి. గుండ్రటి మొహంమీద సన్నటి బొట్టు నాజూకుగా కనిపిస్తుంది. 'లిప్‌స్టిక్' తాకని ఆమె పెదిమలు లేతగులాబీరంగులోవుంటాయి. ఆ మొహంలో ఆకర్షణలు ప్రతిరోజూ చూస్తున్న నాకు, ఆమె నా కళ్ళల్లోకి వచ్చి కూర్చోవడం ఆశ్చర్యమేమీ కాదు. ఆమెను చూస్తున్నకొద్దీ వింత వింత రంగులు ప్రతిబింబిస్తూ వుంటాయి.

రానురాను నా మనస్సులో నిష్కల్మషమైన వాంఛ చెలరేగింది. దానికి కారణం కేవలం బాహ్యంగా కనబడే ఆమె అందం చందం గురించికాదు. ఆమెలో నిగూఢంగావున్న సభ్యత, వినయము, నమ్రత, సౌమనస్యం నన్ను బాగా ఆకర్షించినాయి. నాకు కాబోయే భార్యకు కావలసిన గుణాలు ఆమెలో దాక్కున్నట్లు పసిగట్టా. రోజులు గడుస్తున్నకొద్దీ నాలో తహతహ యెక్కువయింది. ఆమెతో యెట్లాగయినా మాట్లాడాలనే ఉబలాటం ఎక్కువయింది కాని ఆమాట తలుచుకుంటేనే ముచ్చెమట్లు పోస్తున్నాయి. ఎందుకింత పిరికివాణ్ణయి పోతున్నానో అర్థం కావటలేదు. తలుచుకుంటే ఆశ్చర్యంగా వుంది. నాది పవిత్రమైన ఆశయమే! కాని ఎందుకనో భయంగా వుంటోంది.

ఆనాడు ఆ అమ్మాయి బస్‌స్టాండుదగ్గర నిలబడి వున్నప్పుడు కాస్తంత ఎడంగా నేను కూడా ఉన్నట్టు ఆమె గమనించవేలేదు. అటూ ఇటూ తేరిపార జూస్తోంది. అప్పటికీ నన్ను చూసినట్టులేదు. నాలో నేను మధనపడుతున్నా. ఇప్పుడే పలకరించాలనే ఆవేశం నన్నావహిం

చింది. గుటకలు వేస్తూ రెండడుగులు వేశా. మా ఇద్దరిమధ్య ఉన్న దూరాన్ని చేతనయి నంతవరకు తగ్గించేశా. ఆమె చూసి కూడా ముభావంగా వుండటం ఓ విధంగా నాకు కాస్త ధైర్యాన్నిచ్చింది. జేబురుమాలతో మొహమంతా తుడుచుకుంటూ "నమస్తే" అన్నా గంభీరంగా.

చిరునవ్వుతో నమస్తే అంటూ నా వంక చూసింది.

'మీరు... మా ఇంటి పక్క సందులో వుంటున్నారుగదూ...' సంభాషణ ఎట్లా మొదలుపెట్టాలో తెలియక అన్న ముక్కలు.

'అవునండీ...! ఆమె కనురెప్పలు వంగి నాయి.

తడుముకోకుండా 'అవునండీ' అనటంలో ఆమెకూడా నన్ను ఓ కంట కనిపెడుతూనే వుందని అర్థమయి పోయింది. నన్ను చాలా రోజుల్నుంచి పరిచయమున్న వ్యక్తిగా ఆమె భావించటం నా కెంతో శక్తి నిచ్చింది.

మా చెల్లెలు యీ యేడాది మెట్రిక్ పరీక్షకు వెళ్ళింది...' మామూలుగానే నవ్వాను.

ఆమె చప్పున రిక్షాలో కూర్చుంది. వెళుతూ కుడిచేతివేళ్ళను తమాషాగా తిప్పి, నా వంక చూసింది.

నాలో ఎన్నెన్నో ఆలోచనలు చెలరేగినాయి మనస్సంతా నిండివుంది. అట్లాగే బరువుగా చాలాసేపు నిలబడిపోయాను. నాకు బాగా ధైర్యం వచ్చింది. నన్ను ఆమె పూర్తిగా అర్థం చేసుకుందనే నమ్మకం కలిగింది.

ఆకులు రాలినాయి. ఎండలు కాసినాయి. వర్షాలు కురిసినాయి. మే మిద్దరంకూడా ఎన్ని సార్లు ఏమేమి మాట్లాడుకున్నామో యిప్పుడు చెప్పటం కష్టం. కళ్ళతో పలకరించటం, చిరునవ్వులతో విడిపోవటం గడిచిపోయి ఎన్నో ఏళ్ళయినట్లుంది. పరిచయం ప్రగాఢం అయిన కొద్దీ యిద్దరిలో వున్న బెరుకుతనం సడలి పోయింది. ఆమె నన్ను ఓ గొప్ప సంస్కారం గల యువకుణ్ణిగాను, ఆదర్శ పురుషుణ్ణి

---

## ఇ. ల. నరసింహశాస్త్రి

---

"మిమ్మల్ని చాలా రోజులబట్టీ చూస్తున్నా కూడా పలకరించటం కుదర్నేలేదు. మీ విషయం తెలుసుకుందామని నాకు కలిగిన క్యూరియాసిటీని మీరు క్షమిస్తారనుకుంటా!..." ఫరవాలేదు, బాగానే కుదిరిం దనుకున్నా.

ఆమె నవ్వింది.

"మా ఫాదర్ రిటైర్డ్ ఆఫీసరు ... నేను యూనివర్శిటీలో చదువుతున్నా, మా తమ్ముడు యీ యేడు పి. యు. సి. లో చేరాడు!... అన్నది కనురెప్పలు పైకి ఎత్తుతూ.

"థాంక్యూ!...థాంక్యూ!..." తడబడ్డట్టు అన్నాను.

ఆమె వేడిగా, వాడిగా నా కళ్ళల్లోకి చూసింది. ఆమె చూపులో నా కేదో అర్థం గోచరించింది.

'మా ఫాదర్ యింకా సర్వీసులోనే వున్నారు...నేను యం. ఏ. చదువుతున్నా...

గాను, సభ్యతగల వ్యక్తిగాను, సహృదయత గల మనిషిగాను వాళ్ళ నాన్నగార్ని పరిచయం చేసినప్పుడు ఆమెలోవున్న గుణాల్ని నాలో చూసుకుం దనుకున్నాను. ఆ అమ్మాయిని ప్రత్యేకంగా అమ్మకు పరిచయం చెయ్యక మునుపే నేను చెప్పాలనుకున్న విశేషణాలన్నీ మా అమ్మే ఏకరువు పెట్టింది. నన్ను చూసి ఆనందపడింది. మా నాన్నగారు గంభీరంగా నావైపుకు చూసి మనసులో సంతోషపడ్డాడు.

మా రెండు కుటుంబాలవారు అత్యంత సన్నిహితులుగా అయిపోయినారు. ఒకరిమీద ఒకరికి గౌరవం, అభిమానం, మర్యాదలు ఏర్పడ్డాయి. రాకపోకలు ధారాళంగా జరిగి పోతున్నాయి. ఆమె తమ్ముడు మా ఇంటికివచ్చి గంటల తరబడి కాలక్షేపం చేస్తూ వుంటాడు. వాళ్ళింటికి వెళ్ళినప్పుడు మా చెల్లెలూ అంతే. ఆమె మా ఇంటికివస్తే మే మెవ్వరంకూడా

అపరిచితురాలు వచ్చినట్టుగా భావించడంలేదు. ఆత్మీయురాలు వచ్చినట్టుగానే వుంది. ఎంత దగ్గరగా వస్తే అంత బాగా ఒకర్నొకరు అర్థం చేసుకుంటున్నామనే విశ్వాసం కలుగుతోంది. ఆమెతో ఎంతసేపు మాట్లాడినా, నాకు విసుగంటూ లేదు. ఆమె నాతో మాట్లాడుతున్నప్పుడు ఎబ్బెట్టుగా ఎప్పుడూ కనపడలేదు.

ఊరు నిద్ర పోతోంది, డాబామీద గదిలో లైటుముందరకూర్చుని చదువుదామని పుస్తకం తెరిచా. కాగితాలు తిరగేస్తున్నా నన్నమాటేగాని ఏమీ కనిపించటంలేదు ఆపేజీల్లో. ఆమె రూపే ఆమె ఆకృతే కనిపిస్తోంది, ఒక్కనిమిషమన్నా నన్ను వదలిపెట్టి వుండలేకపోతేయెట్లాగు అని ఆమెను అడిగాను. ఆమె కిల కిల నవ్వుల్లో నా హృదయం పులకరించింది, ఎదురుగా కనిపించని వ్యక్తితో చాలాసేపు మాట్లాడి, నాకు కావలసినసమాధానాలుతెచ్చుకున్నా. నా ఆరాటం తగ్గింది. నా మనస్సు శాంతించింది. ఇట్లా ఎన్నెన్ని రాత్రుళ్ళో గడిచి పోయినాయి.

కాని ఆనాడు రాత్రిమాత్రం అట్లా గడపలేదు, విచిత్రమైనరోజు. ఎనిమిదయింది. ఆమె మా యింట్లోనే భోజనం చేసింది. అవీ యివీ మాట్లాడుకుంటూ కూర్చున్నాం. పొద్దుతెలీలేదు. ఆమె నాన్నగారు హఠాత్తుగా వాకిటి గుమ్మం దగ్గరకువచ్చి నిలబడ్డాడు. లోపలికి రమ్మనమని నేను అనబోయేలోగానే; "ఇంతసేపు యేం చేస్తున్నావ్ !..." అనే ఆయన గద్దింపు నా చెవులమీద కర్కశంగా పడింది. ఆయన మొహంలోకి చూస్తున్న నేను క్షణంలో భయపడిపోయాను. మహారౌద్రంగా కనిపించాడు. కనుబొమ్మలు ముడిపడుతున్నాయి. పెదిమల మీద నాలుక గిరగిరా తిరుగుతోంది. ఆయాసపడుతున్నాడు. "హద్దూ పద్దూ లేకుండా యేమిటిక్కడ" అని గట్టిగా కసురుకున్నాడు. కూతురివైపుకు తీక్షణంగాచూస్తూ 'పద యింటికి'... అంటూ కుడిచేతి చూపుడు వేలును వాకిటివైపుకు చూపించాడు.

ఆమె చివాలున లేచి నిలబడింది. తల వంచుకుంది. నాకుచెర్రుమన్నది. చెడ్డఅసహ్యం వేసింది. ఆయన ప్రవర్తన చూస్తోంటే నా రక్తము వుడికిపోయింది. ఆ క్షణాన ఎన్నో ఆలోచనలు వెర్రిగా వచ్చి యిష్టే ఎగిరి



పోయినాయి. ఈ సమయంలో నేను తొందర పడకూడదని తమాయించుకున్నా. కాని "ఏమిటండీ! ఎందుకింత కోపం" అనిమాత్రం అనకుండా వూరుకోలేకపోయాను.

"ఊ..." అంటూ నా వైపుకు హుంకరిస్తూ చూశాడు.

"ఏమిటి మీ ఉద్దేశం!..." గట్టిగా అడిగేశాను.

"ఇంకనుంచున్నావే, పదవేం!..." కూతురివైపుకు తిరిగాడు ఆయన.

ఆమె మెల్లిగా వాకిట్లోకి వెళ్ళిపోయింది. ఆయన పెద్దపెద్ద అంగలువేస్తూసాగిపోయాడు. నాకు వింతగానేవుంది. మాఅమ్మ ఎన్ని అడిగినా నేను ఏమీచెప్పలేకపోయాను. కారణం ఫలానా అని ఊహించటం కష్టంగా వుంది. ఆయనలో హఠాత్తుగా కలిగిన మార్పుకు కారణం ఏమయి వుంటుందా అని ఎన్నిరకాలుగా ఆలోచించినా అంతుపట్టటంలేదు. ఆలోచనలతోనూ, ఆరాటంతోనూ కొన్ని రాత్రులు గడిపేశాను.

ఆ రాత్రి సంఘటన తర్వాత ఎన్నోసార్లు ఆమెను చూశాను. ఆమెతో మాట్లాడాలంటే నాకు చాలా బెరుకుగానూ, అసహ్యంగానూ అనిపించింది. ఆమెకూడా అదివరకుమాదిరి చనువుతో పలకరించనేలేదు. ఆమె బహుశా, తండ్రిగారి తరఫున క్షమాపణ చెప్పుకుంటుందనుకున్నాను. అలాంటిదేమీ జరగలేదు. ఆమె మనస్సులో ఏదో ఆరాటం మాత్రం వున్నట్లుగా ఆమె మొహమే చెపుతోంది. కాని ఆ విషయము ఆమె యెత్తలేక్కాదు, నేనుకూడా తటస్థంగానే వూరుకున్నాను, కాని నేను యెక్కువ కాలం ఆ భారాన్ని, ఆ బాధను యిముడ్చుకోలేకపోతున్నాను. ఎట్లానయి సరే ఆమెను అడిగితీరాలనే నిశ్చయానికి వచ్చేశాను. ఆయనగారి ప్రవర్తనలో హఠాత్తుగా వచ్చిన మార్పుకు కారణం ఏమిటి అని ఆమెను అడగాలనుకున్న సూటిప్రశ్న. కాని అంత డైరెక్ట్‌గా అడగటాని కిష్టంలేదు. మాటల సందున నా అభిప్రాయం ఆమెకు తెలియజేస్తే చాలు ననిపించింది. అదివరకు మాదిరిగా షికార్లు వెళ్లటంలేదు, గంటల తరబడి మాట్లాడటం అంతకంటే కుదరటంలేదు. అప్రయత్నంగా కలుసుకున్నప్పుడు మాత్రం ముక్తసరిగా మాట్లాడటం మినహా యింకా అవకాశమూ దొరకటంలేదు. ఆయన కోపానికి కారణం చెప్పటం యిష్టంలేకపోయినా, తన మనస్సేమిటో విప్పిచెప్పొచ్చుగా అనుకున్నా. ఆమెక్కూడ కోపం వచ్చినట్లుగా నేభావించాను. కారణాలు లేని వారికే కోపాలు యిట్టే వచ్చేస్తుంటే నేను మాత్రం కోపం యెందుకు తెచ్చుకోకూడదూ అనుకున్నా. నిజానికి నాకూ కోపం వచ్చింది. వాళ్ళమీదకాదు, ఆ ప్రవర్తన మీద కాదు. దానికి కారణం ఏమిటో చెప్పనందుకుమాత్రం తీవ్రంగానే కోపం వచ్చింది. ఏమైనాగాని దానికి కారణం ఏమిటో తెలుసుకోనంతవరకు నాకు మనశ్శాంతి లేదు. ఆమెను ఒంటరిగా కలుసుకోవటం పెద్ద సమస్యేమీ కాదు. కాని కలుసుకున్నప్పుడు మాత్రం నేను అడగదలుచుకున్న ప్రశ్న అడగటమే సమస్యగా తయారయింది. కాని యీనాడు అదేమీ లేదు. అడిగేశాను నేను కూడా, నామీద బాగా కోపం వచ్చినట్లుందని.

ఆమె గిర్రున నావైపుకు తిరిగింది.

"మీఇంటికి వచ్చిన పెద్దమనిషిని ఎట్లా గౌరవించాలో తెలీదు... పైగా నిర్లక్ష్యంగా, పెద్దవారనే భావమన్నా లేకండా మాట్లాడటం మాత్రం తెలుసు..." ఆమె కంఠంలో కరుకుతనం బాగా వుంది.

'వచ్చిన పెద్దమనిషి ఏంమాట్లాడినా ఫరవాలేదనుకుంటాను...! అయినా నేను అగౌరవపరిచిం దేముంది?" ఉద్రేకాన్ని అణచుకుంటూ ఆమెకు సూటిగా సమాధానంచెప్పాను.

"ఇంకేం కావాలి!... వచ్చినవారిని కూర్చోమనన్నా అనకుండా వాకిట్లో మనిషిని వాకిట్లోంచి పంపించేశారు!..." ఆమె కనుబొమ్మల ముడివడ్డాయి.


నా కెంతో ఆశ్చర్యము వేసింది. చేసింది తప్పు అని ఆయన అనటం నన్ను చాలా బాగుంది అనుకున్నాను. ఆ సమయంలో నేనేం చెప్పాలో నా కేమీ తోచలేదు.

ఆమె యిదా చివరికి నన్ను అర్థం చేసు

కున్నదీ అనుకున్నాను. ఆమె తండ్రిగారి మొహంలోకి నేను క్రోధంగా చూశానుట. ఆయన కది కటువుగా వున్నదిట, నన్ను మందలించినట్టుగా అన్నది. నా బుర్ర తిరిగి పోయింది. మాట్లాడు తున్నది ఆమేనా అని పించింది. ఆమెమాటల 'షాక్' కునేనుతట్టుకోలేక పోయాను.

"ఇంటికివచ్చి, నానామాటలు మీ నాన్నగారు అనటం బాగానే వుంది గాని, నేను ఆయనవంక చూడటం మీకు అభ్యంతరం కలిగిందేం!..." అని మనస్సులోనే అనుకున్నా. ఆమె మనస్తత్వం నా కర్థం కాలేదు. చాలా సన్ని హితంగా ఆమెను చూడటం వలన, పూర్తిగా అర్థం చేసుకున్నాననే అహంభావం బాగా దెబ్బతిన్నది. ఆమెను గురించి నాకేమీ తెలీదని, ఒక్కక్షణంలో నిర్ణయానికి రావటానికి సిద్ధ పడ్డాను

ఆనాడు రాత్రి నా కంటిమీద కునుకులేదు. ఇంత చనువుగా, చొరవగా, ఆప్యాయంగా వుంటున్న నన్ను, యింత నీరసంగానూ, చులకనగానూ అంటుందా అని ఆలోచిస్తూ వ్యథపడుతున్నా, ఆమెకు నా మీద అధికారం ఏమిటి? ఇష్టం వచ్చినట్టూ మాట్లాడటానికి ఆమెకు ధైర్యం యెట్లా వచ్చింది? అవును; నేనిచ్చిందే అని ఏమో బాధపడ్డా. ఆమెలో అహంభావం బాగా ప్రకోపించింది. తల్లి తండ్రులు యిచ్చిన గారాబంవలన ఆమె యెంత మాటపడితే అంతా యితరులను అన టానికి వెనకాడదు. ఇతరులంటే నిర్లక్ష్యంకూడా బాగానేవుంది. తన అందాన్ని చూసుకుని పెంచుకున్న గర్వంకూడా వుంది. నా అభిమా నాన్ని, నా ప్రేమను ఆమె తృణీకరించింది. ఆమెకు యెంత డబ్బు, చదువూవున్నా ఆమె కోసమని, ఆత్మాభిమానం చంపుకోలేను. ఆమెలో నేను చూశాననుకున్న గుణాలు ఏమీ లేవని యిప్పుడు తెలుసుకుంటున్నాను. అవేశంగా ఎన్నెన్నో, నాలో నేనే అనుకుంటూ సమాధానపడ్డా. ఆమెమీద నాకు కలిగిన అవ్యాజమైన ప్రేమను నా మనస్సులోంచి తొలగించుకోవటానికి నిర్ణయించుకున్నాను.



ఆమె యీ తడవ నన్ను కలుసుకున్నప్పుడు నేనేమీ మాట్లాడదలుచుకోలేదు. అందువలనే అట్లాగే కూర్చున్నాను.

'మీరేమీ అనుకోకుండా వుంటే నేనో మాట అంటాను...' అంటూనే "మీకు కోపం యెక్కువండీ బాగా!..." అన్నది.

నా రక్తం వుడికిపోయింది. ఉద్రేకం బాగా వచ్చేసింది. ఎందుకని గట్టిగా మనస్సులో వున్న దంతా చెప్పేద్దామనుకున్నా. కాని నా ఆవేశం ఆమె అన్నమాటను ధృవపరుస్తుం దేమోనని తమాయించుకుని అందరూ మీ అంత శాంత మూర్తుల్లాగా వుండాలంటే యెట్లా కుదురు తుందండీ!... అన్నాను మెల్లగా.

"అదుగో ఆ మాటలోనే మీ కోపమంతా కనిపిస్తోంది" అంటూ రెట్టించింది.

"కోపం, శాంతం విడివిడిగా వుండవు. రెండూ కలిసేవుంటాయి" అన్నాను ఆలోచనగా.

"ఇతరుల విషయంలో మీ రన్నది నిజమే గావచ్చు గాని, మీలోమాత్రం నేను కోపాన్ని విడిగానే చూశాను" అన్నది ఆమె.

ఎందుకు యీ మాటలు అంటోందీ తేలటం లేదు.

'మీరు మగవారు, ఏంమాట్లాడినాసమర్థించు కోగలరనే ధీమా వుండచ్చు. కాని అలాంటి దేమీ నాకులేదు ...' అంటూ నా వంక చూసింది.

చప్పున నాకు మాచెల్లెలిచేత పంపిన కబురు మాట గుర్తుకొచ్చింది. ఏంలేదు; నా మనస్సు ఆమెకు తెలియచేయాలని ఆమె మనస్సును కూడా పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహ లంతో మా చెల్లెల్ని రాయబారం పంపాను. తర్వాత జరిగిన సంఘటనల వలన ఆమె దగ్గ ర్నుంచి సమాధానం వస్తుందని ఆశించలేదు. అదీగాక నా మనస్సు మార్చుకున్నాననికూడా కబురు పంపుదామని అనుకున్నా. కాని అట్లా చేయలేపు. ఇప్పుడామె వాలకం, ఆమె మాటలు ధోరణి చూస్తుంటే, ఆ ప్రస్తావనేమన్నా తెస్తుం దేమో అనుకుంటున్నా.

"అయినా, మా నాన్నగారిమీద మీకు గౌరవ మర్యాదలు లేవు ... అలాంటప్పుడు ..." అంటూనే చప్పున ఆపేసింది. దూరంగా వస్తున్న ఎవరో అపరిచిత వ్యక్తిని విడ్డూరంగా చూస్తోంది. నేనూ ఆయన వైపుకే చూస్తున్నా. నాకు ఫలానా అని గుర్తుకావటంలేదుగాని, అతన్ని, ఆమె ఇంట్లోనే చూచినట్టు మాత్రం స్ఫురణకు వచ్చింది.

ఆమె నా వైపుకు అదోరకంగా చూసి, గిర్రున సాగిపోయింది. నేను అటే చూస్తూ నిలబడిపోయాను. నా మనస్సు బాగా ఆందోళన పడింది. ఉక్కిరి బిక్కిరయింది. చాలా బాధపడ్డాను. నా జీవితంలోకి రాబోయి నన్ను కలవర పెట్టిన స్త్రీ మూర్తిని నా మనస్సు లోంచి తొలగించేసుకున్నట్లు ఆమెకు తెలియ చెయ్యా లనుకున్నాను. ఇంటికి వెళ్ళిపోయాను.

మర్నాడే ఉత్తరం వ్రాశాను.

"...మిమ్మల్ని దూరంగా చూస్తున్నప్పుడు మీ లో వు న్న ఉత్తమ గుణాలే నాకు కని పించాయి. వాటివలన ఆకర్షింపబడినమాట నిజమే. వాటిని హర్షిస్తూ, మీమీద గౌరవాభిమా నాలు పెంచుకున్నాను. అవి అట్లాగే వుండా లంటే మిమ్మల్ని దూరంగానే చూస్తూ వుండా లనుకుంటున్నాను....ఇందువలన యింకా మీమీద గౌరవము, అభిమానము పెరుగుతా యని ఆశిస్తున్నాను..." అని పూర్తిచేసి, కవరులో పెట్టేసి అతికించేశాను. మా చెల్లెల్ని పిలిచి, యీ కవరును ఆ అమ్మాయికిచ్చి రమ్మనమని చెప్పాను. మా చెల్లెలు ఆ కవరు తీసుకుని గడపదాటిందోలేదో, ఆ అమ్మాయి తమ్ముడొచ్చి నాకో కవరు యిచ్చి వెళ్లాడు.

"...మిమ్మల్ని దగ్గరగా చూపినప్పుడుగాని, మీ మన స్తత్వం నాకు అర్థంకాలేదు. మీ మీద నాకు కలిగిన గౌరవ మర్యాదలు దగ్గరగా రావ టంతో సన్నగిలిపోతున్నాయనితెలుసుకున్నాను. అందువలన ఆవి చెడకుండా ఉండాలంటే మీకు నేను దగ్గరగా రాకపోవటమే అని నిశ్చయం చేసుకున్నాను..."

★